

# కండూతి

"చూశావుటోయ్? "

"ఏమిటి? ... ఏమీ కనబడటంలేదే? ..."

"అదే ఈ శంకరంగాడి సంగతి. ఈమధ్య ఏ పత్రికలో చూసినా వాడి రచనలే! వాడి పేరు సీనారేకు డబ్బాలా మోగిపోతుంటేను."

"అలాగా! మంచిదే! అయినా వాడిలో పైకి వచ్చే లక్షణాలు చాలా ఉన్నాయిలే."

"సరి!... నువ్వు కూడా వాడి పక్షమేనన్నమాట? "

"బాగుంది. ఇదేమిటిలా మాట్లాడుతున్నావు? ... వాడికీ, నీకూ పడదా ఏం? ..."

"వాడికీ నాకూ పీకులాటపడి చాలాకాలమయిందిలే."

"ఓహో! అదా సంగతి!... అందుకేనా యీమధ్య వాడి సంగతి వచ్చినప్పుడల్లా తెగతిడుతున్నావు? "

"లేకపోతే ఏమిటోయ్! వాడి డొక్క చించి చూస్తే అందులో ఒక్క అక్షరం ముక్కన్నా కనపడుతుందా! చెప్పు."

"ఆ బాపతువన్నీ డొక్కలో ఎలా కనిపిస్తాయోయ్! బుర్రలో ఉంటాయిగాని."

"పోనీ, బుర్రలో అన్నా ఉన్నాయా అని? ఏబీసీడీలన్నా రాని, వీడా రచయిత! వీడా కథలు రాసేదీ, కవిత్వం గీకేదీ? "

"తెలుగులో వ్రాయడానికి ఏబీసీడీలు వచ్చి ఉండాలంటావూ? "

"కాదునుకో. కాని, నిన్న మొన్నటిదాకా వాడి సంగతి వచ్చినప్పుడల్లా వాడు వట్టి శుంఠ అనీ, వాడికి రచయిత అయ్యే యోగం లేదనీ నలుగురిలోనూ తిడుతూండేవాళ్ళంగదా.. "

"అవును, అయితే...? "

"మరిప్పుడు అందరూ వాడినో పేద్ద రచయిత క్రింద జమకడుతూ, మనల్ని శుంఠలక్రింద లెక్కగడుతుంటే నీకు చీమకుట్టినట్టన్నా లేదన్నమాట."

"మధ్యలో చీమల గొడవెందుకోయ్. యిదివరలో వాడి రాతలు బాగుండేవి కాదు గనుక తిట్టేవాళ్ళం. కాని, యిప్పుడు బాగానే గీకుతున్నాడటగా? "

"ఏం బాగో ఏమో. వాడి ధోరణి చూస్తుంటే నాకు వళ్ళు మండుతోంది. మొన్నటి పత్రికలో వాడు రాసింది చదివావా? "

"చదవలా. అయినా వాడిమీద నీకు మరీ అంత ఆగ్రహమెందుకోయ్? "

"ఆగ్రహమా, ఈ క్షణాన వాడు నాక్కనపడితే పచ్చడి చేద్దును. లేకపోతే నా గురించి వ్రాయటానికి వాడికెన్ని గుండెలుండాలి? "

"ఏమిటీ? .... నీ గురించా? ..."

"అవును అక్షరాలా... అందులో నా పేరు లేదనుకో. కాని రాసిందంతా నా గురించే."

"అందుకేనా అంతకోపం. ఏం రాశాడేం? "

"నామీద రాసినందుకు కాదనుకో. నిన్న మొన్నటిదాకా మనతో కలిసి తిరిగి మనచేత తిట్లుతిన్న వీడు యివ్వాళ అమాంతం గొప్పవాడయిపోయినట్లు ఫోజులు పెడుతూంటే నాకు వళ్ళు మండుతూంది."

"అలా ఆగ్రహించుకునేకన్నా వాడ్ని మించిపోవటానికి ప్రయత్నం చేయరాదూ? "

"అందుకేగదా యింత పెందరాళే నీకోసం వెదుక్కుంటూ రావటం. ఏం చెయ్యమంటావో నువ్వే చెప్పు."

"చెప్పటానికేముంది. నువ్వు కూడా రాయటం మొదలెట్టు. నీ పేరు కూడా మోగటం మొదలెడుతుంది"

"అది నువ్వు చెప్పాలా? రాయటమైతే ఎప్పుడో మొదలెట్టాను. కాని అందరూ త్రిప్పి పంపేవాళ్ళేగాని ఒక్కడూ అచ్చేసి చావడయ్యే."

"బాగుంది, నీ రచనలు అచ్చేసి వాళ్ళెందుకు చావాలి? అచ్చు వెయ్యనివాళ్ళు చావాలను."

"ఓ! అదీ పాయింటే. యింతకీ నన్నేం చేయమన్నావు? "

"చెప్పానుగదా."

"ఏం చెప్పావు? పనికిరాని సలహాలిచ్చి ఏం లాభం? ఎంత తన్నుకున్నా ఒకటీ సరిగా సాగి చావదయ్యే. ఇంకేం రాసేది...? "

"పోనీ, విమర్శకుడివయిపో!"

"ఉట్టికెగరలేనే, యింక స్వర్గానికేమెగర గలను."

"దానికీ దీనికీ ఏం సంబంధమోయ్? రచయితవు కాలేకపోయినంత మాత్రాన విమర్శకుడివెందుకు కాలేవు? "

"అయితే నేను విమర్శకుణ్ణవగలనంటావా? "

"నీకేమోయ్! ఫస్టు క్లాసయిన విమర్శకుడివయిపోగలవు. అసలు విమర్శ అంటే ఏమిటి? పొంగేలా పొగడటం, లేదా చచ్చేలా తిట్టటం. అంతేగా. ఈ రెండింటిలోనూ నీవు అఖండుడివేనాయె!"

"అయినా ఈ రోజుల్లో విమర్శకులకంతగా పేరులేదు గదా!"

"విమర్శకులకు పేరు లేకపోవడమేమిటోయ్! నీవు బాగా దంచగలగాలేగానీ, రేపీపాటికి ఆ శంకరంగాడు తన రచనల మీద నీ అమూల్యాభిప్రాయాన్ని కోరుతూ సంపుటం సమర్పించుకోడా."

"అలా జరుగుతుందంటావా? "

"అక్షరాలా! కాని, అందుకు దీర్ఘకాల కృషి అవసరం."

"అబ్బే; అలాగయితే లాభం లేదు. నాకంత ఓపిక లేదు. త్వరగా పేరు వచ్చే దారేదన్నా

చూడు."

"పోనీ ఒక పని చెయ్యి. అలా చేశావో నెల తిరగకుండా నీ పేరు మార్మోగితీరుతుంది."

"నీకు పుణ్యముంటుంది, అదేదో త్వరగా చెప్పు. కావాలంటే కాఫీ యిప్పిస్తాను."

"జాగ్రత్తగా విను. ఎవరన్నా మంచి పేరున్న రచయితను చూడు. కవిగాడయితే మరీ మంచిది."

"రచయిత అయితేనేం! నాకు కవిత్వం అసలు అర్థం కాదు."

"కవులకున్నంత పేరు రచయితలకు లేదులే. అందువల్ల తప్పనిసరిగా కవినే వెదుకు."

"వెదకడం దేనికి. అలాంటివాళ్ళు చాలామందే ఉన్నారుగా."

"అదే పనికిరాదు. యిక్కడే జాగ్రత్తగా ఉండాలి. మనం ఎన్నుకోబోయేవాడు అగ్రశ్రేణివాడయి ఉండాలి."

"ఊఁ, తర్వాత...?"

"ఇంకేం! ఆయన రాసిన పుస్తకం ఒకటి కొను. అందులోంచి కొన్ని కొటేషన్లు తియ్యి. ఆయనకసలు కవిత్వమేరాదను. ఇంతవరకూ ఆయన రాసిందంతా ఉత్త చెత్త అనీ, మంచి దేదన్నా ఉంటే అదికూడా దేనికో ఒకదానికి కాపీయే అనీ ఏకిపారెయ్. నీ వాదాన్ని బాగా సాగదీసి దంచెయ్. పత్రికలో అచ్చయిన తర్వాత నీ పేరు మార్మోగకపోతే నన్నడుగు."

"సరే రాస్తాను! పంపుతాను. కాని ఇలాంటివి అచ్చేసేవాడెవడు?"

"అదేమిటోయ్! పత్రికలకేం తక్కువా. ఎన్నిలేవు! ఫర్వాలేదు. అచ్చయి తీరుతుంది."

"సరే వేస్తారే అనుకో. కాని, ఎవడినో తిడితే నాకు ఒరిగేదేమిటి? ఎవడో ముక్కూ మొహం ఎరగనివాడిని నేనెందుకు తిట్టడం?"

"అందులోనే ఉంది కిటుకంతా. గొప్పవాడిని తిడుతున్నావంటే నలుగురి దృష్టి నీమీద పడి తీరుతుంది. అంతా గొప్పవాడంటున్న వాడిని ఏమీ చాతకానివాడని నీవు బహిరంగంగా చాటుతున్నావంటే అందరికీ తెలీనిదేదో నీకు తెలిసి వుంటుందనీ, అందుకే నీవంత ధైర్యంగా తిడుతున్నావనీ, అందరూ కాకపోతే కొందరు బడుద్ధాయిలన్నా అనుకొని తీరుతారు. ఆవిధంగా నీ పేరు..."

"నాకీ కిటుకులేం తెలీవు సుమా. లేకపోతే ఎప్పుడో రాసి వుందును."

"ఇప్పుడు మాత్రం పోయిందేమిటి, రాయి."

"అలాగే. మరి ఎవర్ని గురించి వ్రాయమంటావు?"

"ఆలోచించు. అదికూడా నేనే చెప్పాలా?"

"...ఆ... గుర్తుకొస్తోంది. కాళిదాసుకు చాలా పేరుందటగా? ..."

"ఉంటే...?"

"ఇంకేం! కాళిదాసుకు కవిత్వం రాదనీ, శాకుంతలం రాసింది వాడుకాదనీ, ఏ షేక్స్పియరో అరవంలో ఓ నాటకం రాస్తే యీ కాళిదాసుగాడు దాన్ని మక్కీకి మక్కీ కాపీకొట్టి శాకుంతలం అని పేరెట్టాడనీ, రాస్తే...?"

"ఆహా, బాగానే ఉంటుంది. కాని కొంపదీసి అంతపనీ చేసేవు?"

"ఏం?"

"ఇంకా నయం. అలా రాశావో తక్షణం నలుగురూ కలిసి నిన్ను విశాఖపట్నం పంపే ఏర్పాట్లు చేయగలరు."

"విశాఖపట్నమా? దేనికి? యూనివర్సిటీలో కాళిదాసు కవిత్వం మీద రీసర్చి చేయటా

నికా? "

"ఆహా!... పిచ్చాసుపత్రిలో రీసర్చి చేయటానికేగాని ఇంక ఆ ఆలోచన కట్టిపెట్టి ఇంకెవ రన్నా మంచిపేరున్నవాడిని చూడు."

"సరే, బాగా ఆలోచించి ఎవరో ఒకర్ని పట్టి, వాడి భరతం పడతాలే."

"మంచిది. రాసేటప్పుడు మాత్రం జాగ్రత్తగా ఉండు! నెల తిరిగేలోగా నీ పేరు మార్మో గిపోవాలి సుమా."

"అలాగే.... అలాగే"

* * *

"చూశావుటోయ్."

"ఏమిటి? ... ఏమీ కనపడటంలేదే."

"ఇంకా నీదాకా రాలేదా. ఈమధ్య నా పేరు తెగ మోగుతుంటేను."

"అలాగా. నే నీమధ్య పత్రికలు చదవ లేదులే. అయితే నేను చెప్పిన మంత్రం బాగా పనిచేసిందన్నమాట."

"పని చేయటమా. రైల్లో మందులాడి అజీర్ణ మాత్రల్లా అద్భుతంగా పనిజేస్తేను. నా వ్యాసం అచ్చయిం దగ్గరనుంచి వారం, వారం పత్రికనిండా చర్చలే. అందరూ నా ధైర్యాన్ని మెచ్చుకునేవాళ్లే."

"ఓహో అందాకా వచ్చిందన్నమాట"

"అవును. నాకే ఆశ్చర్యంగా ఉంది సుమా. ఇంతవరకూ నా వ్యాసాన్ని ఖండించే దమ్ము లెవరికీ లేకపోయాయి. అందరూ నన్ను సమర్థిస్తూ, ఆ గజాననరావు కవిత్వాన్ని తూర్పార బట్టే వాళ్లే."

"అయితే నీవు గజాననరావుమీద పడ్డావన్నమాట. సాహసమే."

"అవును మరి. 'సాహసే లక్ష్మీ' అన్నారుగదా పెద్దలు. మనకి డబ్బుక్కర్లేదుగనుక 'సాహసే కీర్తి' అనుకొన్నా. ఎటుతిరిగి ఎటు వస్తుందోనని మొదట కొంచెం భయపడ్డాన నుకో! కాని, ఆ గజాననరావు గాడు చచ్చి స్వర్గానికెళ్ళి చాలాకాలమయిందిగా. అందువల్ల ఇప్పుడు నేనేం వ్రాసినా ఆయనెలాగా సమాధానం చెప్పుకోలేడని ఆలోచించే ఇలా చేశాను. ఎలా ఉందంటావు? "

"భేష్, మంచిపని చేశావు. కాని, ఆయన అభిమానులుంటారు జాగ్రత్త."

"అదీ చూద్దాంలే! పద, అలా పోయి కాస్త కాఫీ త్రాగివద్దాం... అదుగో, ఈ వారం పత్రిక వచ్చినట్లుంది, ఈ వారం చర్చ ఎలావుందో చూద్దాం, ఉండు తెస్తాను..."

"... ... ..."

"ఇదుగో చూడు. నా వ్యాసాన్ని సమర్థిస్తూ ఈ వారం ఇద్దరు ముగ్గురు వ్రాశారు."

"ఎప్పుడూ సమర్థనలే అయితే లాభం లేదు."

"అందాకా రానూ వచ్చింది. చూడు, వీడెవడో నా వాదాన్ని ఖండిస్తూ రాసినట్టున్నాడు."

"అయితే చర్చ రసకందాయంలో పడిందన్నమాటే."

"ఆగవోయ్!... చూడు, వీడు ఒక్కొక్క పాయింటే తీసుకుని నా వాదాన్ని ఎలా ఖండిస్తు న్నాడో."

"అదీ మంచిదే, ఆ ఖండనల్ని నీవు ముండనం చెయ్యొచ్చు చర్చ మరి కొంతకాలం సాగ దియ్యొచ్చు"

"ఏం సాగదీయటమో. వీడెవడో ఉద్ధండపిండంలాగున్నాడు. నా వ్యాసం మొత్తం ప్రతి ఖండనకు వీలులేకుండా ఖండించేశాడీ వెధవ."

"అంత బాగా ర్రాశాడా! ఏదీ కొంచెం చదువు చూద్దాం."

"ఏం రాతలెద్దూ వాడిమొహం. వీడికి మర్యాద ఏమీ తెలిసినట్టు లేదు గజరాజును చూసి శునకరాజు మొరగటం సహజమే. అందువల్ల గజరాజుకేం నష్టం... అంటాడు వీడు."

"ఆహా...!"

"యీ చివర్న ఏం రాశాడో చూడు! 'పంది బురదనే గానీ పన్నీటిని మెచ్చనట్లు కొందరు ప్రబుద్ధులకి ఉత్తమ కవిత్వం రుచించదం'టాడు వీడు."

"ఫర్వాలేదు. నిన్నుద్దేశించి అనలేదుగా."

"అనకపోవడమేమిటి? ప్రత్యక్షంగా కనిపిస్తుంటేను."

"అయితే యింకేం. వాడి వాదాన్ని ఖండించి, వాడి ఖండనల్ని ముండనంచేస్తూ, తిరుగు లేని జవాబు వ్రాసి ఈరోజే పోస్టు చేసెయ్."

"ఏం రాసేది!... వాడే తిరుగులేని జవాబు వ్రాశాడాయె. నాకేం తోచడంలేదు. అయినా వీడసలు నా వ్యాసం ఎందుకు చదవాలంట... చదివినా జవాబెందుకు వ్రాయాలంట? .. వ్రాసినా, యీ పత్రిక వాడెందుకు వెయ్యాలంట? ... పైగా 'ఇంతటితో చర్చ సమాప్తం' అని ఓ నోట్ కూడా తగలేశాడాయె"

"శాంతించు. అలా వెళ్ళి కాస్త వేడివేడి కాఫీ త్రాగివద్దాం పద. యీలోగా ఏదన్నా ఐడియా తట్టకపోదు."

"ఏం ఐడియాలో వీటితో యింతకు ముందేమన్నా పేరుంటే అదికాస్తా ఊడ్చుకుపోయిన ట్లయింది."

☆